


**సొంత ఇంటి కోసం ఓ ఇల్లాలు పడిన తపనను కళ్ళకు కట్టే కథ**

# ప్రభాత స్వప్నం

జి.పద్మావతి

"రాజ్యలక్ష్మీ... కాస్త కాఫీ ఇస్తావా? రెండు కప్పులు ఎక్కువ కలుపు, పిల్లలతోపాటు సరదాగా తాగుదాం!" మార్కెట్ నుండి తిరిగి వచ్చి సోఫాలో కూర్చుంటూ అడిగాడు చక్రవర్తి.

"ఆ... దానికేం భాగ్యం. ఇలాంటి సందేలు వస్తుంటాయి, పోతుంటాయి. మనం మాత్రం ముందుకు వెళ్లం!" కాఫీ కలుపుతూ అంది రాజ్యం.

"వెళదామే.. పిల్లల చదువులయిపోనియ్, దర్జాగా వెళదాం"


"ఎక్కడికీ వెళ్లేది... ఈయన చక్రవర్తి... నేను రాజ్యలక్ష్మి, నించోడానికి నాలుగ్గజాలు నేల కూడా లేదు, అదేమిటో మా నాన్న అక్కలిద్దరికీ పెళ్లిళ్లు బాగానే చేశాడు, నా గురించి సరిగ్గా ఆలోచించలేదు. గవర్నమెంటు ఉద్యోగం.. ఇంకేముంది అని పెళ్లి చేసేశాడు! ఉన్న ఇల్లు కాస్త కూతురికి కట్నంగా ఇచ్చి పాపం అత్తమావలిద్దరూ పై లోకాలకెళ్లిపోయారు. అప్పట్నుండి ఆశ పడుతూనే ఉన్నాను. నా కోరిక కాస్తా ప్రభాత స్వప్నంలా ఉదయాన్నే వచ్చి తెల్లవారేకా కరిగిపోతుంది!" అంటూ కప్పుల్లో కాఫీతో వచ్చింది.

"ఉదయాన్నే కాదమ్మా తెల్లవారుఝామున అనాలి!" నవ్వుతూ సరిచేసింది పెద్ద కూతురు కళ్యాణి.

"పద్దెనిమిదేళ్లప్పుడు మీ నాన్న చేయి పట్టుకుని వచ్చాను. దేనిమీదా ఎక్కువ ఆశపడని నాకు సొంత ఇంటి మీద కోరిక, ఆశ. అది తీరదు. ఆశ చావదు. నా వయసుతో పాటూ పెరిగిపోతుంది. పెళ్లయిన కొత్తల్లోనే చిన్న ఇల్లు అమ్మకానికొస్తే, కొనుక్కుందాం అన్నాను. 'అలా తొందర పడి కొనుక్కుని నేను అప్పులపాలైపోయాను. జీతాలు పెరగనివ్వు' అని ఎవరో సలహా ఇచ్చారట. మానేశారు. జీతాలు పెరిగే దాకా పిల్లలు ఆగుతారా? పెరిగేశారు. చిన్నా చితకా వాళ్లు సొంత ఇళ్లు కట్టేసుకుంటున్నారు. సొంత పెరడుంటే ఆకుకూరలు వేసుకోవచ్చు. కాయగూరలు పండించుకోవచ్చు" అంటూ వంటింట్లోకి వెళ్లింది రాజ్యలక్ష్మి.

"ఏమ్మా.. ఎవరైనా గృహ ప్రవేశం కార్డు ఇచ్చారా?" కూతుర్ని అడిగాడు చక్రవర్తి.

"అవున్నాన్నా! మీ ఆఫీసులో ఎవరో మీ సబార్డినేట్ అంట కార్డు ఇచ్చి మీకు చెప్పమన్నారు. మిమ్మల్ని కలుస్తానన్నాను" మెల్లిగా చెప్పింది పెద్దమ్మాయి కళ్యాణి.



"హమ్మో! మరో రెండు రోజులు అమ్మ ఇదే మూడ్‌లో ఉంటుంది. ఇప్పుడీ ప్రశ్నలను ఎలా తట్టుకోను?" సాలోచనగా అన్నారు.

"అలా పక్కకు పడుకోండి నాన్నా"

"ఈ సోఫా చాలదురా, కూర్చోడానికే ఇద్దరికి తక్కువ...ఒకరికి ఎక్కువానూ" అటూ ఇటూ చూస్తూ అన్నాడు.

"ఆ పేపర్ మొహం మీద వేసుకుని వెనక్కి పడుకోండి!" చిన్నకూతురు అంది.

"తప్పకుండా కొందామే, స్థలం కొనుక్కుని నువ్వే దగ్గరుండి కట్టించుకుందువుగానీ!" అనే మనిషి ఏం మాట్లాడక పోయేసరికి, మళ్లీ హాల్లో కొచ్చింది రాజ్యం "నిద్ర నటిస్తున్నారా?" అని అడిగింది.

"ఇందులో నటించడానికేముందమ్మా! ఎప్పుడూ ఉండేదేగా? ఎక్కడదాకా వచ్చిందే అమ్మ" అంటూ చెల్లెల్ని అడిగింది.

"ఆకుకూరలూ... అరటిమొక్కలూ..."

"ఆ...ఇంకా సాయంత్రం డాబామీద కూర్చోవచ్చు. సన్నజాజి పందిరిలో పూలు కోసుకోవచ్చు. ఎవరూ అనేవాళ్లుండరు. మొన్నటికి మొన్న మా పిన్ని కూతురు వీళ్లు ఇల్లు కట్టేసరికి నా పిల్లలు కూడా ముసలాళ్లయిపోతారు అని ఎద్దేవా చేసింది. నిన్నటికి నిన్న పక్కింటి వాళ్లు చిటికెలో ఫ్లాట్ రిజిస్ట్రేషన్

చేయించుకున్నారు. ఏదో ఉద్యోగం వెల గబెడ్తున్నారు కదా, లోన్ మీద రెండు గదుల ఇల్లు కట్టుకోలేకపోయాం!" అంటూ పెద్ద కూతురు తల్లిని అనుకరించింది. ఆపైన ముగ్గురూ నవ్వుకున్నారు.

"పోమ్మా! ఎప్పుడూ ఉండేదేగా. ఈ పాఠం చిన్నప్పట్నుండి వింటున్నాం!" అంది పేపర్ చదువుతూ చిన్నకూతురు రేఖ. ఎప్పుడూ వాళ్లతో పాటూ నవ్వుకునే రాజ్యం ఈసారి నవ్వలేదు. ఉక్రోషం ఆపుకోలేక ఏడ్చేసింది.

చిరునవ్వుతో గలగలా మాట్లాడుతూ తిరిగే రాజ్యలక్ష్మి కంట నీరు కనపడేసరికి ఎవరూ తట్టుకోలేకపోయారు.

"అమ్మా! నువ్వు నవ్వుకుంటావు, మూడ్ మారుతుందని అనుకరించాం, అలా బాధపడకే కష్టంగా ఉంది" అన్నారు పిల్లలిద్దరూనూ.

"మీకు నవ్వులాటగానే ఉంటుందే. మన కళ్ల ముందు ఎంత మంది ఇంటివాళ్లవ్వట్లేదు? బంగారం ఉంది, కొంచెం లోన్ పెట్టి కొందామంటే వినరు!" అంటూ కళ్లు తుడుచుకుంది రాజ్యం.

"అమ్మా! నీకు తెలియనిదా? పాత బంగారానికి ఎంత వస్తుంది? అదీ పది సవర్లు, లోన్ పెడితే శాలరీ కటింగ్‌లు ఎలా గడుస్తుంది. తమ్ముడి చదువు ఎలాగా? బయట అప్పు చేయగలమా? నాక్కూడా ఉద్యోగం వచ్చాక కొనుక్కుందాం. ఓ.కే.నా" అంటూ నచ్చచెప్పింది తల్లికి పెద్ద కూతురు కళ్యాణి.

"అన్నీ వింటుంది... మళ్లీ ఎవరైనా ఇంటి గురించి చెపితే రామాయణం అంతా మొదలుపెట్టేస్తుంది!" అంటూ మంచినీళ్లు తెచ్చిచ్చాడు చక్రవర్తి.

"ఏమిటో ఈమధ్య మరీ బాధగా అనిపిస్తుందే, సగం జీవితం అయిపోయింది!"

"అమ్మా! సండే అయినా స్పెషల్ క్లాసులున్నాయి, నేవెళ్లాలి అన్నానా, క్యారేజీ సర్దావా?" అన్న కొడుకు మాటల్తో "హయ్యో... పొద్దున్నే మూడ్ పాడుచేసుకున్నాను" అంటూ వంటగదిలోకి పరుగుపెట్టింది రాజ్యలక్ష్మి.

"పిల్లలెంత బాధ్యతగా మాట్లాడుతున్నారు, నిజంగా నేను అదృష్టవంతుణ్ని!" లోపలే అనుకున్నాడు చక్రవర్తి.

☆☆☆



"రాజ్యం, మీ సరళక్క వచ్చింది. ఎక్కడున్నావు, త్వరగా రా" చక్రవర్తి పిలుపుతో గబగబా వరండాలోకి వచ్చింది రాజ్యం. కుశలప్రశ్నలయ్యాక "మన కళ్యాణికి హిందీ పండిట్‌గా ఉద్యోగం వచ్చిందట గదా!" అడిగింది.

"అవును అక్కా, దేవుడి దయ త్వరగానే ఉద్యోగస్తురాలైంది"

"పెళ్లిక్కూడా టైమొచ్చేసింది!" అంది రాజ్యం అక్క సరళ.

"ఏమిటది?" అంటూ రాజ్యలక్ష్మి, చక్రవర్తి ఒకేసారడిగారు.

"మా అత్తవారింటివాళ్లు మొన్న మా ఇంట్లో కళ్యాణిని చూశారంట, ఇద్దరివీ ఒకటే ఉద్యోగాలు కదా... మాట కలపమన్నారు, మీ అభిప్రాయం చెబితే..."

"వాళ్లకు సొంత ఇల్లు అదీ ఉందే మిటే?" రాజ్యం అడిగింది.

"పెద్ద ఇల్లు.. వెనకా ముందు బోలెడు స్థలం. దాన్నిండా చెట్లు, పూల మొక్కలు.."

"రవీమని ఒప్పుకుందాం" అంది రాజ్యం.

"అదేమిటే పిల్ల చూడకుండానా..."

"సొంత ఇంటి కన్నా అదృష్టం ఇంకేముంటుంది చెప్పు!"

అలా రాజ్యలక్ష్మి పెద్దకూతురి పెళ్లి జరిగి అత్తారింటికి వెళ్లిపోయింది.

★★★

"అమ్మా, నాకు యూనివర్శిటీలో ఫస్టు రాంకు వచ్చింది. వచ్చే సంవత్సరం నుండి స్కాలర్‌షిప్ వస్తుంది. మా డిపార్టుమెంట్‌కి సంబంధించిన పరీక్షల్లో సెలెక్టయ్యాను. అక్కడే ఉద్యోగం కూడా వస్తుంది" ఎంతో ఉత్సాహంగా తల్లికి చెప్పింది, రాజ్యం రెండో కూతురు రేఖ.

"అవునా? పోనీలే మనకి ఇల్లు తప్ప దేవుడు అన్నీ ఇస్తున్నాడు!" నీర్సంగా అంది రాజ్యలక్ష్మి.

"అమ్మా!... ఇంటి ధ్యాసలో పడి ఏ ఆనందాన్ని ఎంజాయ్ చేయలేకపోతున్నావు, ప్రపంచంలో అదొక్కటేనా సంతోషం!"

గట్టిగా అనబోయి నొచ్చుకుంటుందేమో అని... "వీకెండ్ కదా, తమ్ముడొస్తాడా, వాడితోనైనా నా సంతోషం షేర్ చేసుకుంటాను, లేదంటే ఇద్దరం కలిసి అక్క దగ్గరకెళతాం... నువ్వూ రామ్మా! నాన్నకెలాగూ కుదరదు" ఉత్సాహంగా అడిగింది.

"తమ్ముడు ఇంజనీరింగ్‌లో చేరే ముందు అలాగే

## కలిసిరాని కోలీవుడ్!

జెనీలియా సినిమా తారగా మారింది తమిళ రంగంతోనే. 'బాయ్స్' సినిమాలో నటించిన ఆమెకి అది ఫ్లాప్ కావడం, తెలుగులో ఆఫర్లతో బిజీ కావడం జరిగింది. మధ్యలో ఒకటి రెండు తమిళ సినిమాలు చేసినా అవి ఫ్లాప్‌లే. తాజాగా 'బొమ్మరిల్లు' (తమిళ వెర్షన్) విజయం సాధించడంతో కొన్ని అవకాశాలు వచ్చాయి. అయితే తెలుగులో వున్న క్రేజ్ తమిళంలో ఆమెకి రాలేదు. లేటెస్టుగా ఓ తమిళ సినిమాలో ఆమెని హీరోయిన్‌గా అనుకున్న నిర్మాతలు ఆమెని తొలగించి శ్రియని తీసుకున్నారట. ఎందుకనో తమిళ సినీరంగం జెనీలియాకి అచ్చిరాలేదనే చెప్పాలి.

అక్క దగ్గరకు వెళ్లామా, ఇంట్లో ఎక్కడవి అక్కడ పడేసుకుని ఇంటి చుట్టూరా ఎండిన ఆకులు, ఆ చెత్తా, ఈ చెత్తా వేసి ఉందని, ఇదంతా శుభ్రం చేసి పూలమొక్కలు వేయండి.. అని చెప్పాను వాళ్లత్తగారికి. దానికావిడ 'మీకు ఇల్లు లేక అలా అనిపిస్తుంది కానీ, మాకిదే మన్నా కొత్త ఇల్లా' అనంది. అప్పట్నుండీ వాళ్లింటికి వెళ్లబుద్ధి కావట్లేదు, మీరు వెళ్లండి" వంట చేసుకుంటూ చెప్పింది రాజ్యలక్ష్మి.

"బోడిగుండుకీ, మోకాలుకీ ముడిపెట్టడం అంటే ఇదే!" ఎప్పుడొచ్చాడో చక్రవర్తి అన్నాడు.

"మీరూ పెద్ద ఇల్లు కట్టండి, నేనూ అలాగే మాట్లాడుతాను!" నా వ్యథ మీకు అర్థం కాదు" సీరియస్‌గా అంది రాజ్యం.

"దానికేం గానీ చిన్నతల్లీ కంగ్రాట్సురా. మనం అంతా రేపు రివర్‌బేకి వెళ్లి ఎంజాయ్ చేద్దాం, అక్కని, బావనీ రమ్మంటాను" ఉత్సాహంగా చెప్పాడు చక్రవర్తి.

"థాంక్యూ నాన్నా! యూ ఆర్ సో స్వీట్" అంది రేఖ.


* * *


తరువాత రాజ్యం వాళ్లింట్లో చాలా మార్పులు వచ్చాయి. రేఖా వాళ్ల సీనియర్ ఆమెను ఇష్టపడితే పెళ్లి చేసేశారు. కొడుకు మంచి ఉద్యోగం పూనాలో స్థిరపడ్డాడు. దగ్గర వాళ్లమ్మాయినే ఇచ్చి అతన్నీ ఇంటివాణ్ని చేశారు. ఇద్దరుద్యోగాలతో పెళ్లయిన ఆరు నెలలకే అక్కడ ఫ్లాట్ కూడా కొనుక్కున్నారు వాళ్లు. కొడుకు సొంతింటి వాడయ్యాడని మహదానందపడిపోయింది రాజ్యలక్ష్మి. ఈ హడావుడిలో పడి తన సొంత ఇంటి కల గురించి మాట్లాడ్డం తగ్గించింది.

"ఆంటీ నాకు ఎంసెట్‌లో మంచి రాంకు వచ్చింది. అమ్మ స్వీట్స్ ఇమ్మంది!" అంటూ పక్కింటి అమ్మాయి స్వీట్స్ ఇచ్చింది. సంతోషంగా చెపుతుంటే పిల్లలు గుర్తు వచ్చారు రాజ్యంకి. వాళ్లకెన్నోసార్లు రాంకులొచ్చాయి, ఫస్టులొచ్చాయి, ఎప్పుడూ సెలబ్రేట్ చేయలేదు. కనీసం కష్టానికి ఫలితం దక్కింది అనే అనలేదు, సొంత ఇల్లు అనే రంధిలో పడిపోయి, దేవుడెన్ని వరాలు ఇచ్చినా ఏదో రకంగా ఇల్లు గురించి మాట్లాడి మూడ్ పాడుచేసేదాన్ని! ఇంక అసలు ఆలోచించకూడదు అని నిర్ణయించుకుంది రాజ్యం. కానీ పెద్ద ఉరుమే ఉరమబోతుందని ఊహించలేదామె.

* * *

"అమ్మగారూ, ఈ నెలాఖర్నుండి నేను పనిలోకి రానండమ్మా! మాకు ప్రభుత్వం



పక్కా ఇళ్లు కట్టించింది కదా ఊరి పొలిమేరలో. అడికెళ్లిపోతున్నాం. దూరం కదాండమ్మగారూ...రాలేను" పనమ్మాయి చెప్పిన మాటలకి ఆశ్చర్యపోయింది రాజ్యలక్ష్మి.

"పనికేం గానీ, మీ పనే బావుందే...సొంత గూటికి వెళ్లిపోతున్నావు. సంతోషం" నవ్వుతూ అంది.

సాయంత్రం ఆఫీసయ్యాక వచ్చిన చక్రవర్తితో పనిపిల్ల గురించి చెప్పబోయేంతలో "మనం నెల్లాళ్లలో వేరే ఇల్లు చూసుకోవాలి రాజ్యం" అన్నాడు.

"అదేమిటీ, ఎన్ని ఖర్చులున్నా అద్దె బాగానే ఇస్తున్నాం కదా!"

"మన ఇంటివాళ్లు మంచి సెంటర్లో ఇంకో పెద్ద ఇల్లు కొంటున్నారట. డబ్బు తక్కువైందని ఇది అమ్మేసి దాని మీద పెడ్తున్నారట ఖాళీ చేయమన్నారు!" అన్నాడు.


"పోనీ ఎంతకిస్తారో తెలుసుకోండి. మనమే తీసుకుందాం" కాసేపు ఆలోచించాక అంది రాజ్యలక్ష్మి.

"అందుకనే కనుక్కుందామని మా ఫ్రెండ్‌తో వెళ్తున్నాను. రెండేళ్లలో రిటైరవుతాను కదా, ఆలోచించి తీసుకుందాం" అంటూ బయటికెళ్లిపోయాడు.

'ఇదింక నా ఇల్లు అయిపోతుంది.

## పాపం ఐశ్వర్య!

అదేంటోగానీ 'రోబో' సినిమాకి అన్నీ ఆటంకాలే అన్నట్టుగా షూటింగ్ ప్రారంభం కావడమే ఆలస్యమైతే, ఇక షెడ్యూల్స్ కూడా నత్తనడకన సాగుతున్నాయి. హీరోయిన్ ఐశ్వర్యారాయ్ నటిస్తుందా లేదా అని అనేక సందేహాలు. అఫ్‌కోర్స్ ఇప్పుడు ఆమెనే హీరోయిన్. అయితే ఇందులో తనకి ఇస్తున్న కాస్ట్యూమ్స్ పట్లా, మేకప్ తీరు పట్లా ఐశ్వర్య ఏమాత్రం సంతృప్తి లేదని ఆమె తన సన్నిహితుల దగ్గర వాపోయిందిట. కానీ దర్శకుడు అగ్రశ్రేణి వ్యక్తి కావడంతో నోరు మెదపడం లేదట.



మంచి రంగులేసుకుని, కొంచెం మోడల్ చేయించాలి' అనుకుంటూ కొత్తగా పైనా కిందా చూసుకుంది. పన్నెండేళ్ల నుండి ఉన్న ఇల్లులాగా లేదు. రెండు గదులు, ముందు హాలు, చిన్న వంటిల్లు. తలుపులు కిటికీలు చేత్తో తడిమి చూసుకుంది. మురికి ఉన్న చోట కొంగు పెట్టి తుడిచింది. చప్పుడైతే గబగబా వీధిలోకి చిన్నపిల్లలా పరుగుపెట్టింది.

"మనం అద్దెకి వేరేది చూసుకోవాల్సిందే" చక్రవర్తి అన్నాడు.

"ఎందుకని.." కళ్లింత చేసుకుని ఆశ్చర్యంగా అడిగింది.


"ఆయన చాలా రేటు చెప్పారు. అదీ సమంజసంగానే ఉంది కానీ, పెళ్లిళ్లకి, చదువులకి లోన్లు అన్నీ వాడేశాను. అదే ఎంతో ప్రాబ్లం. ఎంతో రాదు... మన దగ్గరా అంత లేదు" అంటూ నచ్చచెప్పాడు. తరువాత రోజు నుండి ఇద్దరూ ఇళ్లవేటలో పడ్డారు.

ఇల్లు బాగుంటే ఆఫీసుకి చాలా దూరం. దగ్గరైతే అద్దె ఎక్కువ. అన్నీ బాగుంటే, ఈ వయసులో వాళ్లకివ్వం! మీ పిల్లలు దగ్గరలోనే ఉన్నారా? అని డైరెక్టుగా అడిగిన వాళ్లూ ఉన్నారు. వారం రోజులు తిరిగీతిరిగీ విసిగి పోయారిద్దరూనూ. అద్దెకి ఇల్లు వెతకడం కూడా కష్టమేలా ఉంది అనుకున్నారు.

"ఏవండీ... ఇల్లు లేని వాళ్లు ఆఖరి దశలో ఏం చేయాలి? పిల్లలు దూరంగా ఉంటారు. దగ్గరున్నా అన్నీ కలిసి వస్తాయా? మనలాంటి వాళ్లు ఓల్డేజ్ హోమ్‌కి వెళ్లిపోవాలా? మనం కూడా అంతేనా?" అమెకేదో భయంగా ఉంది.

"ఎందుకు రాజ్యం... అంత బాధపడ్తావు, ఊళ్లో ఇళ్లే కరువయ్యాయా ఏమిటీ.. దొరుకుతుంది, కంగారు పడకు" అంటూ ధైర్యం చెప్పాడు కానీ అతనికీ లోపల ఏదో సంశయం. 'మేమూ ఓల్డేజ్ హోమ్‌కి వెళ్లిపోవాలా? ఉండగలమా?' అనుకున్నాడు.

ఇద్దరూ వెతుకుతూనే ఉన్నారు. కూతుళ్లిద్దరూ ఇంట్లో ఉండమన్నా అతను వినలేదు. తక్కువలో ఫ్లాట్ ఏదన్నా తెగించి తీసుకుందామనుకున్నాడు. దానికీ సమయం పడుతుందే?!



* * *

"ఏవండీ, మన ఇంటి ఓనరుగారు వచ్చారు" రాజ్యం మాటతో వీధిలోకొచ్చాడు చక్రవర్తి.

"వెతుక్కుంటున్నాం సార్.. కొంచెం టైమివ్వండి" నమ్రతగా అడిగాడు చక్రవర్తి బయటికొస్తూనే.

"వద్దు చక్రవర్తిగారూ, మీరు మారనక్కర్లేదు. మన పెద్దవాళ్ల నుండి ఆ ఇల్లు వచ్చింది అమ్మవద్దని మా ఆవిడ ఒక్క మాట మీద నుంచుంది. నేను వేరే విధంగా డబ్బు ఏర్పాటు చేసుకుంటాను"

"నిజంగానా, ఈ ఇల్లు అమ్మడం మానేశారా?" ఆశ్చర్యంగా అడిగింది రాజ్యం.

"అవునమ్మా, మీరు ఎన్నాళ్లున్నా నాకు అభ్యంతరం లేదు. మీదే అనుకోండి. వస్తాను" అంటూ వెళ్లిపోయారు ఓనరు.

రాజ్యలక్ష్మి ఒక్క పరుగులో పక్కింటావిడ దగ్గరకెళ్లింది. "మేము ఇక్కడే ఉంటున్నాం. అలవాటైన ఇల్లు" అంటూ సంతోషంగా ఏదో చెప్తోంది.

"పాపం, అల్పసంతోషి, రాజ్యం కోరిక తీరలేదు. రిటైరయ్యాక అయినా ఆమె కోరిక తీర్చాలి అనుకున్నాడు. ఇంకా గట్టిగా మాట్లాడుతూనే ఉంది రాజ్యలక్ష్మి.

'మా లాంటి మధ్యతరగతి నిస్సహాయుల ఆనందం ఇంతేనేమో...! మనసులో కోరికలు ప్రభాత స్వప్నంలా కరిగిపోతాయేమో! ఎప్పటికైనా తమలాంటి వాళ్లకి సొంత ఇల్లు కట్టుకునే అవకాశం ఉంటుందా?! వస్తుందా?' అతని ఆలోచనకు ఆనకట్ట లేదు.

☆

## భావన బాడ్‌లక్!

ఎంతో హంగామాగా మొదలైన భావన సినీకెరీర్ అకస్మాత్తుగా డల్ అయిపోయింది. ఇప్పుడామెకు తమిళంలో ఒకే సినిమా వుందిట. ఒంటరి, హీరో సినిమాల తర్వాత తెలుగులో అవకాశాలే లేవు. శ్రీకాంత్ నూరవ సినిమాలో నటిస్తున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. మాతృభాష మలయాళంలో కూడా ఆఫర్లు పెద్దగా లేవుట. పాపం భావన టైమ్ బాలేదనుకోవాలి. తన కెరీర్‌లో లోపాన్ని సరిచేసుకునే ప్రయత్నాల్లో వుందిట భావన.